ఎడిటర్ : రత్నం వారరాజా
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
హైదరాబాద్, ఆదివారం 21 డిసెంబర్ 2025సంపుటి 100 సంచిక :29 పేజీలు 8వెల/5 రూ
Published From: Hyderabad, Circulated::Hyderabad,Nalgonda,khammam,Rangareddy, Sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,krishna

# అస్సాంలో ఘోర రైలు ప్రమాదం

గజరాజుల గుంపును ఢీకొట్టిన రాజధాని ఎక్స్‌ప్రెస్

ఎనిమిది ఏనుగులు మృతి..

మరో గున్న ఏనుగుకు గాయాలు

పట్టాలు తప్పిన రైలు ఇంజిన్, ఐదు కోచ్‌లు

ప్రయాణికులు సురక్షితం

రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం




2లో..



## కాంగ్రెస్ పాలనలో

# ఈశాన్య రాష్ట్రాలపై శీతకన్ను

వారి పాలన వైఫల్యంతోనే భారత్‌లోకి చొరబాట్లు

చొరబాటుదారులు భూములు ఆక్రమించారు..

అడవులను ధ్వంసం చేశారు..

అస్సాం ప్రజల అస్తిత్వాన్ని దెబ్బతీశారు..

ఆ తప్పులను బీజేపీ ప్రభుత్వం సరిదిద్దుతున్నది:ప్రధాని మోదీ

గౌహతిలో రూ.15,600 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

గౌహతి, డిసెంబర్,20 తరంగాలు:

'కాంగ్రెస్ హయాంలో ఈశాన్య ప్రాంతం నిర్లక్ష్యానికి గురైంది. ఈశాన్య రాష్ట్రాలపై కాంగ్రెస్ శీతకన్ను వేసింది. ఆయా రాష్ట్రాల అభివృద్ధి గు రించి ఏమాత్రం పట్టించుకోలేదు. నాటి పాలకులు చేసిన తప్పులను బీజేపీ ప్రభుత్వం సరిదిద్దుతున్నది.అభివృద్ధికి బాటలు వేస్తున్నది. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నది' ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నా రు. అస్సాం పర్యటనలో భాగంగా శనివారం ప్రధాని రాష్ట్ర రాజధాని గౌహతిలో సుమారు రూ.15,600 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. తొలుత లోకప్రియ గోపీనాథ్ బోర్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సుమారు రూ.4,000

వివరాలు 2లో..

# మీ వల్లే నష్టపోయాం

16 మంది ఎమ్మెల్యేలపై సీఎం సీరియస్!

పంచాయతీ ఎన్నికల్లో సరిగా పనిచేయలేదని ఆగ్రహం

నల్లగొండ, వరంగల్, పాలమూరుతోపాటు పలు జిల్లాల ఎమ్మెల్యేలకు క్లాస్

నియోజకవర్గ ఇన్‌చార్జీలు, డీసీసీ అధ్యక్షుల మధ్య సమన్వయలోపం

జిల్లాల నుంచి నివేదికలు తెప్పించుకోవాలని టీపీసీసీకి మీనాక్షి నటరాజన్ సూచన



హైదరాబాద్, డిసెంబర్,20 తరంగాలు:

పంచాయతీ ఎన్నికల ఫలితాలు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. మూడు విడత ల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అంచనా వేసిన దానికన్నా తక్కువ స్థానా ల్లో గెలవడం, బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలు విజయం సాధించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రెబల్స్‌ను సమన్వయం చేయలేకపోయారని, సరిగా పనిచే యలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. మీ వల్లే నష్టపోయామంటూ.. మొత్తం 16 మంది ఎమ్మెల్యేలపై సీఎం మండిపడినట్లు తెలిసిందిరెబల్స్‌ను బుజ్జగించి పోటీనుంచి త ప్పించడంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు చొరవ తీసుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పలు జిల్లాల నేతల నుంచి ఫిర్యాదులొచ్చాయి. ఈ క్రమంలోనే పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు మరికొంత మంది సమావేశంలో పాల్గొని ఫలి తాలపై సమీక్ష నిర్వహించారు.పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులపై రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రెబల్స్‌తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని తప్పుబట్టారు. పార్టీకి తీరని నష్టం చేశారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశా రు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు తమ వైఖరి మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని హెచ్చరించిన ట్లు తెలిసింది. డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ

వివరాలు 2లో..

# ఒత్తిడిలో కూరుకుపోతున్న సమాజం



- మనసుకు విశ్రాంతి ఎక్కడ- పెరుగుతున్న ఒత్తిళ్లు తగ్గిపోతున్న ప్రశాంతత

- ఆధునిక జీవనశైలి మోపుతున్న మానసిక భారాలు

డెస్క్, 11 డిసెంబర్, తరంగాలు:

ఆధునిక సమాజంలో మనిషి జీవితం నిత్యం ఒక ఒత్తిడి వలయంలోనే తిరుగుతోంది. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకూ బాధ్యతలు, లక్ష్యాలు, భయాలు, కలిసి మనసుపై భారంగా మారుతున్నాయి. చదువులో పోటీ, ఉద్యోగంలో పనిభారం, కుటుంబ అవసరాలు, ఆర్థిక భద్రతపై ఆందోళన%ా% ఇవన్నీ కలిసినప్పుడు మనిషికి శారీరకంగా కాకపోయినా మానసికంగా అలసట పెరుగుతోంది. బయటకు సాధారణంగానే కనిపించినా, లోపల మాత్రం చాలామంది ఒత్తిడితో సతమతమవుతున్నారు. ఈ పరిస్థితి ఒక్కో వ్యక్తి సమస్యగా కాకుండా, సమాజం మొత్తాన్ని ప్రభావితం చేసే అంశంగా మారింది.సాంకేతిక అభివృద్ధి మన జీవితాన్ని సులభతరం చేస్తుందని ఆశించినా, అదే అభివృద్ధి కొత్త రకాల ఒత్తిళ్లను తీసుకొచ్చింది. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, నిరంతర సమాచార ప్రవాహం మన మనసుకు విశ్రాంతినివ్వకుండా చేస్తోంది. ఇతరుల విజయాలతో పోల్చుకుని తాము వెనుకబడ్డామన్న భావన చాలామందిలో అసంతృప్తిని పెంచుతోంది. ఎప్పుడూ ఏదో సాధించాలన్న ఒత్తిడి, ఎదుటివారిని మిం చాలన్న తాపత్రయం మనసును నిశ్చలంగా ఉండనివ్వడం లేదు. ఈ నిరంతర పోటీ వాతా వరణం మానసిక ఆరో గ్యంపై తీవ్ర ప్రభావం

వివరాలు 2లో..

# భారతీయ ప్రాచీన జ్ఞానంతో ప్రపంచ సమస్యల పరిష్కారం

బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ 21వ వార్షికోత్సవంలో రాష్ట్రపతి ముర్ము



హైదరాబాద్ గచ్చిబౌలి, డిసెంబర్,20 తరంగాలు:

సామాజిక ఐక్యతకు, జాతీయ ప్రగతికి ఆధ్యాత్మికత ఒక బలమైన పునాదిగా పనిచేస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ఆధ్యాత్మిక చైతన్యంతో ప్రేరణ కలిగిన ప్రజలు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తారని, దేశ నిర్మాణానికి చురుగ్గా సహకరిస్తారని పేర్కొన్నారు. బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ 21వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం గచ్చిబౌలిలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహించిన 'భారత కాలాతీత జ్ఞానం: శాంతి, పురోగతికి మార్గం' సదస్సులో రాష్ట్రపతి ప్రసంగించారు. భారతీయ

వివరాలు 2లో..

## పోటెత్తనున్న

# మేడారం భక్తులు..

రాజన్న క్షేత్రం అధికారులకు దర్శనాల నిర్వహణ పరీక్షే

ఆలయ పునర్నిర్మాణ పనుల మధ్య అన్నీ సవాళ్లే!

వేములవాడ, డిసెంబర్,20 తరంగాలు:

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం మరోసారి మహాభక్తజన ప్రవాహా న్ని చవిచూడనుంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపుపొందిన మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపిస్తున్న వేళ.. తెలంగాణతో పాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు వేములవాడ వైపు కదలివస్తారు.మేడారం జాతరకు బయలుదేరే భక్తులు ముందుగా రాజన్నను దర్శించుకోవడం అనే విశ్వాసం తరతరాలుగా కొనసాగుతుండటంతో, జాతర సమయంలో వేములవాడ క్షేత్రం భక్తజన సంద్రంగా మారడం పరిపాటే. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. రాజన్న ఆలయాన్ని పునరుద్ధరించేందుకు పనులు చేపట్టడంతో సమస్యలు తీవ్రమయ్యాయి. ఆలయ

వివరాలు 2లో..







# ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలను పట్టించుకోని వైనం

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే నిధులు లేక సతమతం

ఒక ఎమ్మెల్యే అప్పు కోసం ప్రపంచ బ్యాంకుకు లేఖ రాయడం రాష్ట్ర దుస్థితికి అద్దం పడుతోంది

ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు

ప్రభుత్వానికి కనీస ప్రణాళికా జ్ఞానం లేకనే రాష్ట్రంలో యూరియా కష్టాలు

బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఫైర్



2లో..

## ఒత్తిడిలో కూరుకుపోతున్న సమాజం

మొదటి పేజి తరువాయి

చూపుతోంది.

ఒత్తిడి కొంతమేర ప్రేరణనిస్తుందన్నది నిజమే. కానీ అది హద్దు దాటితే సమస్యలు మొదలవుతాయి. నిద్రలేమి, చిరాకు, కోపం, ఆందోళన వంటి లక్షణాలు క్రమంగా పెరుగుతాయి. దీర్ఘకాలంలో ఇవి మానసిక ఆరోగ్య సమస్యలుగా మారే ప్రమాదం ఉంది. అయినా, మన సమాజంలో ఇప్పటికీ మానసిక సమస్యలను బలహీనతగా చూడడం కొనసాగుతోంది. సమస్య ఉందని ఒప్పుకోవడానికే చాలామంది వెనుకాడుతున్నారు. ఈ మౌనం, నిర్లక్ష్యం చివరికి మరింత పెద్ద సమస్యలకు దారితీస్తోంది.

మనసుకు విశ్రాంతి అంటే పనిని పూర్తిగా వదిలేయడం కాదు. ఆలోచనలకు కొంత విరామం ఇవ్వడమే అసలు అర్థం. రోజువారీ జీవితంలో కొద్దిసేపు అయినా నిశ్శబ్దం, స్వీయ పరిశీలన అవసరం. మనం చేస్తున్న జీవనశైలి మనకు నిజంగా ఆనందం ఇస్తుందా? మన జీవితంలో పని వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత ఉందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకకపోతే, ఒత్తిడి మరింత పెరుగుతుంది. విశ్రాంతి అనేది అలసత్వం కాదు, అది తిరిగి బలంగా ముందుకు సాగేందుకు అవసరమైన శక్తి.

కుటుంబాలు, కార్యాలయాలు, సమాజం కలిసి మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. పనితీరుతో పాటు మనిషి మనసు స్థితికీ విలువ ఇవ్వాలి. మాట్లాడుకోవడం, వినడం, అర్థం చేసుకోవడం వంటి మానవీయ విలువలను తిరిగి బలపరచాలి. ఒత్తిడిలో కూరుకుపోతున్న సమాజానికి ఇది అత్యవసర పాఠం. మనసు ఆరోగ్యంగా ఉంటేనే వ్యక్తి ఆరోగ్యంగా ఉంటాడు, సమాజం కూడా ఆరోగ్యంగా ముందుకు సాగుతుంది. ఈ సత్యాన్ని అంగీకరించిన రోజే నిజమైన అభివృద్ధి మొదలవుతుందన్న విషయాన్ని ఈ పరిస్థితులు స్పష్టంగా సూచిస్తున్నాయి

## పోటెత్తనున్న మేడారం భక్తులు..

మొదటి పేజి తరువాయి

పునర్నిర్మాణ, అభివృద్ధి పనులు ప్రస్తుతం ఆలయ ప్రాంగణంలో జోరుగా కొనసాగుతున్నాయి. దీనితో భక్తుల దర్శనాల కోసం తాత్కాలికంగా భీమేశ్వరా లయ ప్రాంగణాన్ని వినియోగిస్తున్నారు. సాధారణ రోజుల్లోనే ఇక్కడ రద్దీని నియంత్రించడం కష్ట సాధ్యం. ఇక మేడారం జాతర సమయంలో లక్షలాది మందికి దర్శనాలు కల్పించడం సాధ్యమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రధాన ఆలయంతో పోలిస్తే భీమేశ్వరాల య ప్రాంగణం విస్తీర్ణం తక్కువగా ఉండ టంతో క్యూలైన్లు, భద్రతా ఏర్పా ట్లు అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. పార్కింగ్ స్థలాల కొరత, రహదారులపై వా హనాల నిలిచిపోవడం వల్ల సాధారణ ప్రజలతో పాటు అత్యవసర సేవలకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందిపోలీస్, రవాణా శాఖలు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. క్యూలైన్లను ఒక పద్ధతి ప్రకారం విభజించడం, దర్శన సమయాలను నియంత్రిం చడం, అదనపు వైద్య బృందాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచడం వంటి చర్యలు అత్యవసరమని భక్తులు సూచిస్తున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే మేడారం జాతర సమయంలో వేములవాడ క్షేత్రానికి అసాధారణ రద్దీ ఏర్పడు తుంది. ఆలయ ఆదా యం పెరగడమే కాకుండా, పట్టణ వ్యాపారాలు, హోట ళ్లు, రవాణా వ్యవస్థలు అన్నీ కళకళలాడుతాయి. ట్రాఫిక్ పార్కింగ్ సమస్యలుభక్తుల భారీ రాకతో వేములవాడ పట్ట ణం పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రతరం అవుతున్నాయి. పార్కింగ్ స్థలాల కొరత, రహదారులపై వాహనాల నిలిచిపోవడం వల్ల సాధారణ ప్రజలతో పాటు అత్య వసర సేవలకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. భీమేశ్వరాలయ ప్రాంగణంలో అధిక రద్దీ కారణంగా ఊపిరి సల పని పరిస్థితి ఏర్పడితే భక్తుల భద్రతకు ము ప్పు ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భక్తుల ఆందోళనతాత్కాలికంగా ఏర్పాటుచేసిన షెడ్లు, మంచినీటి వసతి, మరుగుదొడ్లు వంటి మౌళిక సౌకర్యాలు లక్షలాది భక్తులకు సరిపోతాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి రావడం, చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బం దులుపడే పరిస్థితి కనిపిస్తోంది. ఇరుకైన మార్గాల్లో అధిక రద్దీ వల్ల తోపులాటలు, అనూహ్య ఘటనలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు.

### భారతీయ ప్రాచీన జ్ఞానంతో
## ప్రపంచ సమస్యల పరిష్కారం

మొదటి పేజి తరువాయి

ప్రాచీన జ్ఞానం, ఆధ్యాత్మిక వారసత్వం ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న మానసిక, నైతిక, పర్యావరణ సమస్యలకు పరిష్కారం చూపుతుందని ఆమె అన్నారు. వేల ఏళ్లుగా భారతీయ నాగరికత సత్యం, న్యాయం, కరుణ, ప్రకృతితో మమేకమై జీవించడం వంటి సూత్రాలపై ఆధారపడి ఉందని గుర్తుచేశారు. వసుధైక కుటుంబం భావన నేటి ప్రపంచ శాంతికి అత్యంత అవసరమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ద్వారా భారతీయ ప్రాచీన జ్ఞానానికి ప్రపంచ గుర్తింపు లభించిందని... తద్వారా ప్రపంచ శాంతికి, మానవ కల్యాణానికి అగ్రదూతగా భారత్ నిలిచిందని ఆమె తెలిపారు. భౌతిక అభివృద్ధితో మాత్రమే జీవితంలో సుఖశాంతులు లభించవని... అంతర్గత స్థిరత్వం, భావోద్వేగాల నియంత్రణ, విలువలతో కూడిన ఆలోచన చాలా అవసరమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధిని కాంక్షించే సమతుల అభివృద్ధి ఉపనిషత్తుల సారాంశానికి అనుగుణంగా ఉందని రాష్ట్రపతి చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ సంకల్పం మనకు స్వావలంబన నేర్పుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఇంధనం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రకృతితో సహజీవనం చేయాలనే భారతీయ ఆలోచన విధానం నుంచి ఉద్భవించాయని వివరించారు. భారతీయ విలువలను వివిధ దేశాలకు వ్యాపింపజేస్తున్నాయంటూ బ్రహ్మకుమారీస్ సంస్థను రాష్ట్రపతి అభినందించారు. 21 ఏళ్లుగా విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణం, శాంతి, సానుకూలతలు పెంపొందిస్తున్నారని ఆమె పేర్కొన్నారమానవాళికి సామరస్యం, శాంతియుత సహజీవన విలువలను మన దేశం యుగాలుగా మానవాళికి అందించిందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. వేగవంతమైన శాస్త్రీయ పురోగతితో పాటు ఒత్తిడి, సంఘర్షణలు, పర్యావరణ సమస్యలు, నైతిక అయోమయాన్ని మానవాళి నేడు ఎదుర్కొంటోందన్నారు.

# ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, : 'పల్లెలపై కాంగ్రెస్ ప్రభుత్వం పగపట్టింది. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ తదితర కీలక పథకాలను పక్కనపెట్టింది. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ అగ్రస్థానంలో ఉంది. ఒక ఎమ్మెల్యే అప్పు కోసం ప్రపంచ బ్యాంకుకే లేఖ రాయడం రాష్ట్ర దుస్థితికి అద్దం పడుతోంది. సర్కారు చేతగానితనానికి 'యూరియా యాప్' ఒక నిదర్శనంగత రెండేళ్లుగా రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేస్తూ వస్తున్న ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారు' అని ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. తాండూరు నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ప్రజా ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారురైతులకు అందాల్సిన రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ వంటి కీలక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనబెట్టిందని కేటీఆర్ విమర్శించారు. సాగుకు అవసరమైన కరెంట్ సరఫరాను కూడా అస్తవ్యస్తం చేసి, అన్ని అంశాల్లో ప్రజలను పట్టిపీడిస్తోందని ధ్వజమెత్తారు. రైతాంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి లేమివల్లనే నేడు పల్లెల్లో అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. యూరియా యాప్‌తో లైన్లను దాచే కుట్రరైతులకు యూరియా సరఫరా చేసే విషయంలో ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న మొబైల్ అప్లికేషన్ విధానాన్ని కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. రైతుల అవసరాలకు తగ్గట్లుగా యూరియా సంచులను సరఫరా చేయలేక, ఇప్పుడు మొబైల్ యాప్ ద్వారా ఇస్తామని రైతులను మభ్యపెడుతున్నారని ఆయన విమర్శించారు. ఒకప్పుడు నేరుగా దుకాణాల వద్దకే వెళ్లిన రైతులకు ఎరువులు అందించలేని ఈ చేతగాని ప్రభుత్వం, ఇప్పుడు యాప్ ద్వారా ఇస్తామంటే ఎవరూ నమ్మరని ఎద్దేవా చేశారు. ఎరువుల కోసం రైతులు పడుతున్న కష్టాలు, వారి లైన్లు బయటి ప్రపంచానికి కనిపించకుండా దాచిపెట్టేందుకే ఈ 'మొబైల్ యాప్ నాటకం' కాంగ్రెస్ మొదలుపెట్టిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 10 సంవత్సరాల పాటు ఎరువుల కోసం రైతులు ఎప్పుడూ క్యూ లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి లేదని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస ప్రణాళికా జ్ఞానం లేకపోవడం వల్లనే నేడు రాష్ట్రంలో యూరియా కష్టాలు మొదలయ్యాయని అన్నారు. కేసీఆర్‌కు రైతులపై ఉన్నట్లుగా గుండెల్లో ప్రేమ ఉంటే, రైతన్నలకు ఈ సమస్యలు వచ్చేవి కావు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ ప్రేమ, చిత్తశుద్ధి రెండూ లేవు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రభుత్వం 'లైన్లను దాచే' ప్రయత్నాలు పక్కనబెట్టి, అసలు సమస్యపై దృష్టి సారించాలని కేటీఆర్ హితవు పలికారు. రైతన్నలకు తక్షణమే అవసరమైన మేర యూరియాను సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు సమస్యలు సృష్టించడం మానేసి, చిత్తశుద్ధితో వారి సంక్షేమం కోసం పనిచేయాలని కోరారుప్రజల సొమ్ముకు కాంగ్రెస్ నేతలు ధర్మకర్తలు మాత్రమేస్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలను ఎవరూ హరించలేరని, గ్రామాల్లో సర్పంచులే అసలైన కథానాయకులని, గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు, విధులు రాజ్యాంగం ప్రకారం సంపూర్ణంగా సర్పంచులకే చెల్లుతాయని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇందులో ఏ ఎమ్మెల్యే లేదా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకునే అధికారం లేదన్నారు. ప్రభుత్వ నిధులు ఏ నాయకుడి సొంత ఆస్తి కాదని, ప్రజలు పన్నుల రూపంలో కట్టిన సొమ్ము అని గుర్తు చేశారుమనం కేవలం ఆ ప్రజాధనానికి ధర్మకర్తలుగా ఉండి, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయాలని సూచించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో పల్లెలే పట్టుకొమ్మలనే నినాదంతో గ్రామాలను అభివృద్ధి చేశామని ఆయన గుర్తు చేశారు. 'పల్లె ప్రగతి' కార్యక్రమం ద్వారా ప్రతినెలా నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ చేశామన్నారు. దీనివల్ల తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచి 30 శాతం జాతీయ అవార్డులను గెలుచుకున్నాయని కొనియాడారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ గ్రామ పంచాయతీ తీర్మానమే కీలకమని, సర్పంచుల సంతకం లేకుండా ఏదీ సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారుప్రజలను మోసగించడంలో కాంగ్రెస్ అగ్రస్థాన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి కుంటుపడిందని కేటీఆర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే రెండున్నర లక్షల కోట్ల అప్పు చేసినా, కనీసం ఒక్క కొత్త రోడ్డు కూడా వేయలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే నిధులు లేక ఇబ్బంది పడుతున్నారని, ఒక ఎమ్మెల్యే అప్పు కోసం ప్రపంచ బ్యాంకుకు లేఖ రాయడం రాష్ట్ర దుస్థితికి అద్దం పడుతోందని ఎద్దేవా చేశారుముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని, ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ అగ్రస్థానంలో ఉందని మండిపడ్డారు. తాండూరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలంగా ఉందని, 67 మంది సర్పంచులు గెలవడం శుభపరిణామమని కేటీఆర్ అన్నారు. రాబోయే రెండేళ్లు నిధుల పరంగా కొంత ఇబ్బంది ఉన్నా, ప్రజల కోసం గట్టిగా నిలబడాలని పిలుపునిచ్చారుకాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, చేస్తున్న అప్పులను గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, కర్నె ప్రభాకర్, తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, నియోజకవర్గ ముఖ్యనేతలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అస్సాంలో ఘోర రైలు ప్రమాదం

గౌహతి, డిసెంబర్ 20: అస్సాంలో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. హొజా య్ జిల్లాలో శనివారం తెల్లవారు జామున సైరంగ్- రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు ఏనుగుల గుంపును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది ఏనుగులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో గున్న ఏనుగుకు గాయాలయ్యాయి. ప్రమాద తీవ్రతకు రైలు ఇంజన్ తో పాటు ఐదు బోగీలు పట్టాలు తప్పాయి. శనివారం తెల్లవారుజామున 2:17 గంటల ప్రాంతంలో మిజోరాంలోని సైరంగ్ నుంచి ఢిల్లీ వెళుతున్న రాజధాని ఎక్స్‌ప్రెస్ ఈ ప్ర మాదానికి గురైంది. గువాహటికి సుమారు 126 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారని రైల్వే అధికారులు తెలిపారు. ప్ర మాద వార్త తెలియగానే సహాయక బృందా లు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారురైలు పట్టాలపై ఏనుగుల కళేబరాలు. ఈ ప్రమాదం కారణంగా రైలు పట్టాలపై ఏనుగుల కళేబరాలు చెల్లాచెదురుగా పడటంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఎగువ అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లే రైలు సర్వీసులపై ప్రభావం పడింది. ప్రమాదానికి గురైన రైలులోని ప్రయాణికులను అదే రైలులోని ఖాళీ బెర్తుల్లో సర్దుబాటు చేశారు. గువాహటి చేరుకున్న తర్వాత అదనపు కోచ్‌లను జతచేసి, రైలును తిరిగి ఢిల్లీకి పంపిస్తామని అధికారులు తెలిపారుకాగా, ఈ ప్రమాదం జరిగిన ప్రాంతం ఏనుగుల కారిడార్ కాదని అటవీ అధికారులు తెలిపారు. రైలు పట్టాలపై ఏనుగుల గుంపును గమనించిన లోకో పైలట్ వెంటనే ఎమర్జెన్సీ బ్రేకులు వేసినప్పటికీ, ఏనుగులు వేగంగా రైలును ఢీకొట్టడంతో ఈ ఘోరం జరిగిందని రైల్వే అధి కారులు తెలిపారు. కాగా, ప్రభావిత కోచ్‌లలోని ప్రయాణికులను తాత్కాలికంగా రైలు లోని ఇతర కోచ్‌లలోని ఖాళీ బెర్తులలో ఉంచారు. రైలు గౌహతి చేరుకున్న తర్వాత, ప్రయాణికులకు వసతి కల్పించడానికి అదనపు కోచ్‌లను జత చేస్తామని, తర్వాత వారిని గమ్యస్థానాలకు చేరుస్తామని రైల్వే అధికారులు తెలిపారుఐదేళ్లలో రైళ్లు ఢీకొని 79 ఏనుగులు మృగత ఐదు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా పలు రైలు ప్రమాదాల్లో 79 ఏనుగులు మృతిచెందాయని పర్యావరణ మంత్రిత్వ శాఖ గత ఆగస్టులో పార్లమెంట్‌కు తెలిపింది. 2020 నుంచి 2024- వరకు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలనల నివేదికల ఆధారంగా ఈ సంఖ్యను లెక్కించినట్లు పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఈ ఏడాది జూలై 18న పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలో ఖరగ్‌పూర్ సెక్షన్లో వేగంగా వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని తల్లి, ఆమె పిల్లతో సహా మూడు ఏనుగులు మృతి చెందాయని సింగ్ ధృవీకరించారు.

## మీ వల్లే నష్టపోయాం


మొదటి పేజి తరువాయి

ఇన్‌చార్జ్‌ల మధ్య సమన్వయలోపం కూడా ఇందుకు కారణమని చెప్పినట్లు సమాచారం. రెబల్స్‌ను బుజ్జగిస్తే మరికొన్ని స్థానాలు మనమే గెలిచేవాళ్లమని ఎమ్మెల్యేలతో చెప్పినట్లు సమాచారం పునరావృతం కావొద్దు : మినాక్షి వార్నింగ్‌మీ వల్లే ఓడిపోయామని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లపై అసహనం వ్యక్తం చేశారు. రెబల్స్ విషయంలో జాగ్రత్త తీసుకోకపోవడంతో ప్రతిపక్ష పార్టీలకు కలిసొచ్చిందని నేతలతో చెప్పినట్లు తెలిసింది. మీ సమన్వయం లోపం వల్ల గెలిచే స్థానాలను కోల్పోవాల్సి వచ్చిందని, ప్రధానంగా నల్లగొండ, వరంగల్, పాలమూరుతోపాటు మరికొన్ని జిల్లాల నేతలకు సీఎం, మీనాక్షి నటరాజన్ క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. మరోసారి ఇది పునరావృతం కావొద్దని నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసిందిగెలిచిన రెబల్స్‌ను తిరిగి పార్టీలో చేర్చుకోవాలని పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కు మీనాక్షి నటరాజన్ సూచించినట్లు తెలిసింది. జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకొని నష్టానికి కారకులెవరో తేల్చాలని ఆదే శించినట్లు సమాచారం. దీనిపై త్వరలోనే సమగ్రంగా చర్చించేందుకు సమీక్షా సమావేశాన్ని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. కాగా, రాష్ట్రంలో ఈనెల 11, 14, 17 తేదీలలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలను కట్టబెట్టారు. ఫస్ట్, సెకండ్ ఫేజ్‌లో సుమారు 56 శాతం స్థానాలను గెలిచిన కాంగ్రెస్ పార్టీ మూడో ఫేజ్‌లోనూ అదే హవాను కొనసాగించింది. మొత్తం 12,733 స్థానా ల్లో 7,010 స్థానాలు, బీఆర్ఎస్ 3,502, బీజేపీ 688, ఇతరులు 1505 చోట్ల విజయం సా ధించారు. కాంగ్రెస్‌కు పట్టున్న కొన్ని ప్రాంతాల్లో సర్పంచ్ స్థానాలను కోల్పోవడంతో దానికి బాధ్యులైన పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో సమావేశాన్ని నిర్వహించారు.

### కాంగ్రెస్ పాలనలో
# ఈశాన్య రాష్ట్రాలపై శీతకన్ను

మొదటి పేజి తరువాయి

కోట్ల వ్యయంతో 1.4 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన కొత్త టె ర్మినల్స్‌ను ఆయన ప్రారంభించారువిమానాశ్రయం వెలుపల గోపీనాథ్ బోర్డోలోయ్ 80 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించారు. తర్వాత నగరంలోని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీపై ఘాటు విమర్శలు చేశారు. ఈ ప్రాంత భద్రతను, అ స్సాం అస్తిత్వాన్ని కాపాడడేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అస్సాంలోకి అక్రమ చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని ఆరోపించారు. చొరబాటుదారులు అడవులను, భూములను ఆక్రమిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ ఊరుకుందని విమర్శించారు. ఓటరు జాబితాలో చొరబాటుదారులు లేకుండా ఎన్నికల సం ఘం చేపట్టిన సంస్కరణలను కొందరు దేశద్రోహులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అస్సాం ముమ్ముం దు భారత అభివృద్ధికి ముఖద్వారంగా మారబోతుందని ఆకాంక్షించారు. డబుల్ ఇంజి న్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అస్సాంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. బహిరంగ సభ తర్వాత ప్రధా ని గౌహతిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ పార్టీ కార్యకర్తలతో సమావేశమై రాను న్న ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వాశర్మతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వర్చువల్‌గా తాహెర్‌పూర్ ర్యాలీ ప్రారంభంఅస్సాం పర్యటన తర్వాత ప్రధాని పశ్చి మ బెంగాల్‌లోని తాహెర్‌పూర్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ కావాల్సి ఉంది. కానీ, ప్రతికూలమైన వాతావరణం కారణంగా ఆయన ప్రయాణం రద్దయింది. దీంతో ప్రధాని వర్చువల్‌గా తాహెర్‌పూర్ ర్యాలీలో భాగస్వామి అయ్యారు. ముందుగా బీజేపీ శ్రేణుల ర్యాలీని ప్రారంభించారు. బెం గాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం చొరబాటుదారులను ప్రోత్సహిస్తోందని ప్రధాని ఆరోపించారుఅనంతరం ప్రధాని మాట్లాడుతూ.. బెంగాల్ ప్రభు త్వం చొరబాటుదా రులను కాపాడుకునే క్రమంలోనే రాష్ట్రంలో ఎన్నికల



సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్ర త్యేక సమగ్ర సవరణ (సర్)ను వ్యతిరేకిస్తున్నదని దుయ్యబట్టారు. సీఎం మమత పాలనలో బెంగాల్‌లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. అలాంటి 'మహా జంగిల్‌రాజ్'కు తగిన బుద్ధి చెప్పాలంటే రాష్ట్రప్రజలు డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి పనులను మమత ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఆరోపించారు. నేడు 'పరీక్షా పే చర్చ'రెండో రోజు అస్సాం పర్యటనలో భాగంగా ఆదివారం ప్రధాని మోదీ బ్రహ్మపుత్ర నదిపై క్రూయిజ్ షిప్‌లో ప్రయాణిస్తూ పాఠశాల విద్యార్థులతో 'పరీక్షా పే చర్చ' నిర్వహించనున్నారు. సుమారు 25 మంది ప్ర తిభావంతులైన విద్యార్థులతో ఆయన స్వయంగా మాట్లాడనున్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎలా జ యించాలనే అంశంపై విద్యార్థులకు సూచనలివ్వనున్నారు. ఆ రాష్ట్రంలో నదీ పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రధాని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం నాటి అస్సాం ఉద్యమంలో అసువులు బాసిన 860 మంది అమరవీరుల స్మారకార్థం నిర్మించిన 'స్వహిద్ స్మారక క్షేత్రాన్ని' ప్రధాని సందర్శిస్తారు. తర్వాత నమ్రూపుక్‌కు చేరుకుని సుమారు 12,000 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అమ్మోనియా- యూరియా ఎరువుల ప్రాజెక్టుకు భూమిపూజ చేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించి ఢిల్లీకి తిరుగు పయనమవుతారు.

## సంస్కృతిక ఐకాన్ 'బాతిక్'

హైదరాబాద్, : బాతిక్.. ఇది ప్రాచీన మైనపు అద్దకాలకు సంబంధించిన చిత్రకళ. దీని మూలాలు ఈజిప్ట్, చైనా, ఇండోనేషియాలో ఉన్నాయి. క్రమంగా ఈ సంస్కృతి భారత్‌కు వచ్చింది. 'బాతిక్' అనే పదం ఇండోనేషియా నుంచి వచ్చింది. అక్కడి జావా భాషలో 'అంబా' అంటే అద్దకం, 'తిక్' అంటే చుక్క అని అర్థం. అంటే.. వస్త్రంపై మైనంతో చుక్కలు పెడుతూ వేసే చిత్రకళ అని అర్థం1817 లో థామస్ స్టాంఫోర్డ్ రాఫిల్స్ రాసిన 'హిస్టరీ ఆఫ్ జావా' పుస్తకం వల్ల ఈ కళకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. భారతదేశంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 'శాంతినికేతన్'లో ఈ కళ పునరుజ్జీవం పొందింది. ఠాగూర్ 1920 ప్రాంతంలో ఈ కళను దేశవ్యాపితం చేసేందుకు ఎంతో కృషి చేశారు. అంతటి ఘన చరితగల చిత్రకళ తెలంగాణలోని సిద్ధిపేటలో ఇప్పటికీ విలసిల్లుతున్నఇక్కడి కళాకారులు ఈ శైలిలో తెలంగాణ ప్రాంతపు గ్రామీణ జీవితాలను, శ్రమైక జీవన సౌందర్యాన్ని అద్భుతంగా వస్త్రాలపై ఆవిష్కరిస్తున్నారు. ఈ కళకు జీవో గ్రాఫికల్ (జీఐ ట్యాగ్) గుర్తింపు తీసుకువచ్చేందుకు తాజాగా 'సిద్ధిపేట బాతిక్ పెయింటింగ్స్ సొసైటీ' దరఖాస్తు చేసిం ది. వారికి రాష్ట్ర పరిశ్రమల శాఖ సహా య, సహకారాలు అందిస్తున్నది. జీఐ ట్యాగ్ గుర్తింపు వస్తే ఈ కళ అంతర్జాతీయ ఖ్యాతి గడించనున్నది. కళాకారుల ఆర్థికాభివృద్ధికి జీఐ ట్యాగ్ దోహదం చేస్తుందిగ్రామీణ జీవితంపై చిత్తరువులసిద్ధిపేటకు చెందిన బాతిక్ కళాకారులు వ్యవసాయం, కుల వృత్తుల శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబించే విధం గా ఈ చిత్తరువులు రూపొందించి అబ్బురపరుస్తున్నారు. చిత్రాలకు కళాకారు లు వినియోగించే మైనపు రంగులు ఎంతో గాఢంగా ఉంటాయిప్రకృతి సిద్ధమైన రంగులు వినియోగించడం వల్ల చిత్తరువు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. వస్త్రంపై మైనం ఆరిన తర్వాత కళాకారులు వాటిని నలిపేస్తారు. దీంతో వస్త్రంపై సన్నని మైనపు పగుళ్లు ఏర్పడతాయి. ఇదే బాతిక్ చిత్రకళ ప్రత్యేకత. ఆ పగుళ్లు చిత్తరువుకు ఒక రకమైన పురాతనమైన, కళాత్మకమైన రూపం తీసుకువస్తాయిఇతర చిత్రకళల కంటే భిన్నఇతర చిత్రకళలతో పోలిస్తే బాతిక్ చిత్రకళ భిన్నమైనది. విలక్షణమైనది.

# చిన్నారుల సమస్యలపై కల్వకుంట్ల కవిత ఆవేదన

**- ప్రభుత్వం స్పందించకపోతే నిరాహార దీక్షకు సిద్ధం**

**- ఎన్ఐఈపీఐడీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు, తల్లిదండ్రులతో భేటీ**

**- పెన్షన్లు, ఇళ్లు, ప్రభుత్వ పథకాలపై ప్రాధాన్యత డిమాండ్**

**- నెల రోజుల్లో చర్యలు లేకపోతే ఉద్యమం ఉధృతం**

హైదరాబాద్, డిసెంబర్ 20 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): బోయిన్‌పల్లి మనో వికాస్ నగర్‌లోని మానసిక అభివృద్ధి లోపం ఉన్న వ్యక్తుల సాధికార సంస్థలో శిక్షణ పొందుతున్న ప్రత్యేక





అవసరాలు గల చిన్నారులు, వారి తల్లిదండ్రులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమావేశమయ్యారు. ఇటీవల జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా ఈ సంస్థను సందర్శించిన కవిత, అనంతరం జాగృతి కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, మానసిక పరిపక్వత తక్కువగా ఉన్న పిల్లలకు ఏ ప్రభుత్వం వచ్చినా సరైన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశంలో మానసిక ఎదుగుదల లోపం ఉన్నవారిని గతంలో దివ్యాంగులుగా గుర్తించలేదని గుర్తు చేశారు. అయితే పార్లమెంట్‌లో పోరాటం చేసిన ఫలితంగా 21 రకాల సమస్యలు ఉన్నవారిని దివ్యాంగులుగా గుర్తించారని తెలిపారు. తెలంగాణలో దివ్యాంగుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత కల్పించేలా తానే పోరాటం చేసి ఉత్తర్వులు తీసుకొచ్చినప్పటికీ, అవి సక్రమంగా అమలు కావడం లేదని విమర్శించారు. మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లల తల్లిదండ్రుల బాధలు తనకు బాగా తెలుసునని కవిత అన్నారు. ఇలాంటి కుటుంబాలకు ఇళ్లు అద్దెకు కూడా దొరకని పరిస్థితి ఉందని చెప్పారు. అందుకే వారికి రెండు గదుల ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానని స్పష్టం చేశారు. అలాగే పెన్షన్ కూడా తప్పనిసరిగా ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా ఈ సమస్యతో బాధపడుతున్నవారు ఉన్నారని అంచనా ఉందన్నారు. వారందరికీ పెన్షన్ ఇచ్చే సామర్థ్యం ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు.

ప్రభుత్వం పెన్షన్లు ఇవ్వకపోతే అది మనసు లేనట్టేనని వ్యాఖ్యానించిన కవిత, ప్రతి ప్రభుత్వ పథకంలో మానసికంగా, శారీరకంగా సవాళ్లు ఎదుర్కొంటున్న పిల్లల తల్లిదండ్రులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భర్తను కోల్పోయిన మహిళలు, ఒంటరి మహిళలకు కూడా పెన్షన్ల విషయంలో ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. పిల్లలను అవమానించకుండా, గౌరవించే విధంగా ప్రభుత్వం విధానాలు రూపొందించాలన్నారు. ఈ అంశాలపై ముందుగా ప్రభుత్వానికి లేఖలు రాసి ఒక నెల గడువు ఇస్తామని కవిత ప్రకటించారు. నెల రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే తానే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. పెన్షన్లు, ఇళ్లు మంజూరు చేసే వరకు ప్రభుత్వం వెంటపడతామని స్పష్టం చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, దివ్యాంగుల సమస్యలపై ఈ విభాగం నిరంతరం పోరాటం చేస్తుందని, స్పైనల్ సమస్యలు ఉన్నవారిని కూడా పెన్షన్ పథకాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధుల బాధ్యతగా మీ తరపున తానే పోరాటం చేస్తానని, మీకు ఇబ్బంది లేకుండా చూస్తానని కల్వకుంట్ల కవిత భరోసా ఇచ్చారు.




# పంచాయతీ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల గుణపాఠం

**- గాంధీ పేరు తొలగింపు అప్రజాస్వామికమని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్- ఏఐసీసీ పిలుపుతో ఎంజీ రోడ్డులో కాంగ్రెస్ ధర్నా- జాతీయ ఉపాధి హామీ పథకంపై బీజేపీ కుట్రలపై తీవ్ర విమర్శ- కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం**

**హైదరాబాద్, డిసెంబర్,20 తరంగాలు:**

ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎంజీ రోడ్డులో నిర్వహించిన ధర్నాలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో బీజేపీపై విమర్శలు గుప్పించారు. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టారని వ్యాఖ్యానించారు. ప్రజా వ్యతిరేక విధానాలతో బీజేపీ గ్రామీణ స్థాయిలో పూర్తిగా తిరస్కరించబడిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ పేరు పలికితే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు ఉలుకుపడతారని ఎద్దేవా చేశారు. గాంధీ కుటుంబం పేరు వినగానే బీజేపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడతాయన్నారు. గాడ్సేను పూజించే వారే గాంధీ పేరు జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గాంధీ పేరు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయమని, దాన్ని ఎవరూ చెరిపివేయలేరని స్పష్టం చేశారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌తో చర్చించి సోనియా గాంధీ నేతృత్వంలో జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా గ్రామీణ పేదలకు వంద రోజుల ఉపాధి కల్పించారని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఈ పథకానికి నిధులు క్రమంగా కోత పెడుతూ వస్తోందని, ఇప్పుడు గాంధీ పేరు తొలగించడం ద్వారా పథకానికే తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు తెరలేపిందని, మనుస్మృతి అమలు చేయాలన్న పన్నాగాలు చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గాంధీ%-%నెహ్రూ వారసత్వాన్ని ప్రజల మదిలో నుంచి తొలగించాలన్న ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని స్పష్టం చేశారు. లౌకిక దేశంలో కులాలు, మతం పేరిట రాజకీయాలు చేసే వారికి గుణపాఠం తప్పదన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసిన వెడమ బొజ్జు ఎమ్మెల్యేగా గెలవడమే ఈ పథకం ప్రాధాన్యానికి



నిదర్శనమని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం అనివార్యమని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్యే వెడమా బొజ్జు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## కట్ట కుమారస్వామి పార్థివ దేహానికి నివాళులర్పించిన కత్రియాల ఉప సర్పంచ్ నాంపెల్లి రవీందర్



వర్ధన్నపేట ప్రతినిధి, డిసెంబర్ 20,తరంగాలు : వర్ధన్నపేట మండలం, కత్రీయాల గ్రామంలో గ్రామ టెంపుల్ చైర్మన్ కట్ట వెంకటయ్య సోదరుడు కట్ట ఐలయ్య పెద్ద కుమారుడు కట్ట కుమారస్వామి (30) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట శాసన సభ్యులు కే. ఆర్.నాగరాజు ఆదేశాల మేరకు వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య,కాంగ్రెస్ నాయకులతో కలిసి కుమారస్వామిభౌతిక దేహానికి పూలమాల వేసి కత్రియాల గ్రామ ఉప సర్పంచ్ నాంపెల్లి రవీందర్ నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరమార్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుజ్జ రవీందర్ రెడ్డి,టెంపుల్ చైర్మన్ కట్ట వెంకటయ్య, మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండి అక్బర్ , మహిళా మండల నాయకురాలు ఇందిరమ్మ కమిటీ సభ్యులు తీగల సునీత గౌడ్,2వ వార్డు సభ్యులు ఎండి రషీద్ ,కాంగ్రెస్ యువ నాయకులు కొండ్రతి సంతోష్, తదితరులు చేవ్వల్ల బీరప్ప లు పాల్గొన్నారు.

## మంచి మిత్రుడిని కోల్పోయాను : కందాళ



పాలేరు ఆర్సీ,20 డిసెంబర్ ( తరంగాలు) : మంచి మిత్రున్ని కోల్పోయానని పాలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. శనివారం పాలేరు గ్రామంలో యడవల్లి రామిరెడ్డి భౌతికకాయాన్ని కుటుంబసమేతంగా సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కందాళ మాట్లాడుతూ రామిరెడ్డి తనకు మంచి మిత్రుడని, ఈ లోకాన్ని విడిచి కానరాని లోకాలకు వెళ్లడం బాధకరం అన్నారు. రామిరెడ్డి కుటుంబానికి భగవంతుడు ఎల్లవేళలా అండదండగా ఉండాలని కోరారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కందాళ వెంట ఆయన సతీమణి విజయమ్మ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఇంటూరి శేఖర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల వీరయ్య, పార్టీ మండల కార్యదర్శి ఆసిఫ్ పాషా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి



వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 20,తరంగాలు : మహిళలపై పెరుగుతున్న సైబర్ నేరాలు, అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని షీ టీమ్ సీఐ కే. సుజాత అన్నారు. హన్మకొండ లోని కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ మరియు మహిళా పిజి విద్యార్థి, విద్యార్థినులకు షీ టీమ్ సీఐ కే. సుజాత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. దాదాపు 600 మంది విద్యార్థులతో మాట్లాడిన షీ టీమ్ సీఐ సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రయాణాల్లో భద్రత కోసం 'టీ-సేఫ్' యాప్ను వినియోగించాలని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. మహిళలపై అనుచితంగా ప్రవర్తిస్తే ధైర్యంగా వెంటనే షీ టీమ్ వరంగల్ పోలీస్కు సమాచారం ఇవ్వాలని, సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్జీ గారు వి.బి నిర్మలా గీతాంబ మేడమ్, కే యు రిజిస్టర్ రామచంద్రన్ గ, షీ టీమ్ ఇన్స్పెక్టర్ కె. సుజాత, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ రాంరెడ్డి , మహిళా కానిస్టేబుల్ లక్ష్మి, లావణ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీని కాపాడుకుందాం

**: మంత్రి సీతక్క పిలుపు**

**- కేంద్ర కుట్రలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమం**

**- మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టంపై ముప్పు**

**- అట్టడుగు వర్గాల హక్కుల కోసం కలిసికట్టుగా పోరాటం**

**- కాంగ్రెస్ ఆందోళనలకు విస్తృత పాల్గొనాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, డిసెంబర్,20 తరంగాలు:**

:మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దానసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. ఈ చట్టాన్ని కాపాడేందుకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఒక ప్రకటనలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఇరవై ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టానికి మోదీ ప్రభుత్వం ఉరి వేయడానికి సిద్ధమవుతోందని ఆరోపించారు. లోక్‌సభలో సరైన చర్చ లేకుండా హడావుడిగా బిల్లులు ఆమోదింపజేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. గ్రామీణ పేదలకు ఉపాధి, గౌరవం కల్పించిన ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం దుర్మార్గమని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పని పొందుతున్న కూలీల్లో తొంభై శాతం మంది ఎస్సీ, ఎస్టీలు, మహిళలేనని మంత్రి గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల ఈ వర్గాల ఆర్థిక స్వేచ్ఛ, ఆత్మగౌరవం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ కుటుంబాలకు భరోసాగా నిలిచిన ఈ చట్టాన్ని బలహీనపరిస్తే



పేదల జీవితాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని హెచ్చరించారు. పనిదినాల సంఖ్య తగ్గించడం, నిధుల కోతలు విధించడం ద్వారా ఉపాధి హామీ చట్టాన్ని క్రమంగా నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని మంత్రి సీతక్క ఆరోపించారు. ఈ విధానాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, వలసలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామీణ ఉపాధిని కాపాడుకోవడం దేశ అభివృద్ధికి కూడా కీలకమని ఆమె పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, సర్పంచులు, కూలీలు, రైతులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# టీఎన్‌జిఓస్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం

,ఖమ్మం జిల్లా ఏకగ్రీవ ఎన్నికఖమ్మం జిల్లా బ్యూరో డిసెంబర్ 20 తరంగాలు :ఖమ్మం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ నందు ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ఖమ్మం జిల్లాలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్,వైద్య విధాన పరిషత్,డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో పని చేస్తున్న సభ్యులు పాల్గొన్నారు. సింగిల్ సెట్ నామినేషన్ రావటంతో ఏకగ్రీవంగా టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టీఎన్జీవోస్ యూనియన్ కోశాధికారి వల్లపు వెంకన్న ప్రకటించారు. ఎన్నిక అనంతరం జరిగిన కార్యక్రమానికి టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథి గా విచ్చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం ఎన్నికలు ఏకగ్రీవంగా జరగటం సంతోషంగా ఉందని, అందరూ ఐక్యంగా ఉంటూ సభ్యుల సమస్యల పట్ల స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు ఉన్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలియజేశారు. టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఇట్టే కిరణ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధిక సంఖ్యలో కేడర్లు, మహిళా ఉద్యోగులు ఉన్న అధిక సంఖ్యలో ఉద్యోగులను కలిగిన వైద్య ఆరోగ్యశాఖలో సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయని ఆ సమస్యల పరిష్కారానికి టిఎన్జిఓస్ యూనియన్ ద్వారా కృషి చేస్తామని తెలియజేశారు. ఖమ్మం జిల్లా అధ్యక్షులు మెడికల్ డిపార్ట్మెంట్ కి చెందిన వారు ఉండటం డిపార్ట్మెంట్లోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందు ఉండే జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు కి అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్





కొమరగిరి దుర్గాప్రసాద్, టీఎన్జీవోస్ సెంట్రల్ కార్యదర్శి జెడ్. ఎస్. జైపాల్, టిఎన్జీవోస్ వైస్ ప్రెసిడెంట్లు యర్రా రమేష్, లలిత కుమారి, సహాయ కార్యదర్శి తాళ్లూరి శ్రీకాంత్, భూసా చంద్ర శేఖర్, రాధికా రెడ్డి, ఆర్గనైసింగ్ సెక్రటరీ పెద్దినేని రాధా కృష్ణ, మహిళా విభాగం కన్వీనర్ బి. వి సుబ్బమ్మ టిఎన్జీవోస్ నగర శాఖ అధ్యక్షులు ప్రభాకర చారి,వివిధ యూనిట్స్ అధ్యక్ష కార్యదర్శులు

పెద్ద పుల్లయ్య, జాబిశెట్టి శ్రీనివాసరావు,గుర్రం శ్రీనివాసరావు అనంత రాములు, నెల్లూరి రవి, ముఖీద్ టీఎన్జీవోస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. నూతన టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం, ఖమ్మం జిల్లా బాధ్యులుగా ఈ క్రింది వారు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఎన్నికైన అభ్యర్థుల పేర్లు అధ్యక్షుడు సి ఎచ్. సైదులు,కూసుమంచి


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. కార్యదర్శి ఎన్. లావణ్య ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్ గా పని చేస్తున్నారు.అసోసియేట్ అధ్యక్షులు వై. విజయశ్రీఉపాధ్యక్షుడు జి. లక్ష్మీనర్సయ్య ఉపాధ్యక్షుడు బి. వీరన్న ఉపాధ్యక్షురాలు (మహిళ)ఎన్. ఉమ సంయుక్త కార్యదర్శి జి. కృష్ణ సంయుక్త కార్యదర్శిటి. సాయికృష్ణ సంయుక్త కార్యదర్శి (మహిళ)డి. పద్మ కార్యాలయ కార్యదర్శి ఎ. సుజాత క్రీడా కార్యదర్శి ఎం. పద్మ కోశాధికారి పిరంగి. శ్రీను ప్రచార కార్యదర్శి బి. మంగీలాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. నాగేశ్వరావు ఈ.సి సభ్యుడు ఎం. ఈ.సి సభ్యుడు డి. దుర్గా ప్రసాద్ ఈ.సి సభ్యురాలు బి. జయశ్రీ ఈ.సి సభ్యురాలు (మహిళ) ఎస్ .శ్యామల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

# ఇండియన్ గ్యాస్ మేనేజర్ ఇష్టారాజ్యం.!

**బుకింగ్ చేసినా అందని సిలిండర్లు**
**పదిహేను రోజులుగా ఎదురుచూపులు.**
**అధిక ధరలకు అక్రమ విక్రయాలు..**
**వినియోగదారుల ఆవేదన.**

చెన్నారావుపేట డిసెంబర్ 20 తరంగాలు

నిత్యావసర వస్తువైన గ్యాస్ పంపిణీలో వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ లోని స్థానిక ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ తీరు వివాదాస్పదంగా మారింది. మేనేజర్ నిర్లక్ష్యం, సిబ్బంది అక్రమాలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 రోజుల క్రితం బుక్ చేసుకున్న సిలిండర్లు ఇప్పటికీ చేరకపోవడంతో సామాన్యులు వంట వండుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు.స్పందించని మేనేజర్.. గ్యాస్ పంపిణీలో జరుగుతున్న ఆలస్యంపై వివరణ కోరేందుకు కార్యాలయానికి వెళ్తే మేనేజర్ అక్కడ ఉండటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. పోనీ ఫోన్ ద్వారా సంప్రదిద్దామన్నా ఆయన స్పందించకపోవడంతో తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక కనెక్షన్ దారులు ఆందోళన చెందుతున్నారు. గంటల తరబడి వేచి చూసినా ఫలితం ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అక్రమ మార్గంలో సిలిండర్లు! ఒకరికి రావాల్సిన గ్యాస్ సిలిండర్లను మరొకరికి మళ్లించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ వినియోగదారులకు 'స్టాక్ లేదు' అని చెబుతూనే, ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లించే వారికి మాత్రం గుట్టుచప్పుడు కాకుండా పంపిణీ చేస్తున్నారని తెలుస్తోంది. కొందరు సిబ్బంది కుమ్మక్కై ఈ విక్రయాలు జరుపుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.చర్యలు తీసుకోవాలి,గ్యాస్ బుక్ చేసి రెండు వారాలు దాటుతోంది. ఏజెన్సీ చుట్టూ తిరగలేక చస్తున్నాం. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ఈ అవకతవకలను అరికట్టాలి,అని స్థానిక వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మేనేజర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు వినియోగదారులు పౌర సరఫరాల శాఖ అధికారులను కోరుతున్నారు.









## గణితం జీవితానికి వెలుగునిచ్చే దారి



కేసముద్రం,మహబూబాబాద్, ప్రతినిధి,డిసెంబర్.20, తరంగాలు:శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్వల యందు తెలంగాణ గణిత ఫోరం మరియు విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ టాలెంట్ టెస్ట్ లో 05 మంది బాలురు12 మంది బాలికలు పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్ అనంతరం మండల శాఖ అధ్యక్షులు తండ సదానందం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల విద్యాధికారి కాలేరు యాదగిరి మాట్లాడుతూ గణితం జీవితానికి వెలుగునిచ్చే మార్గమని కొనియాడారు. అతిథులు మాట్లాడుతూ.ఆధునిక కాలంలో గణితం లేకుండా జీవితాన్ని ఊహించలేమని, గణితం కేవలం సంఖ్యలు సూత్రాలు మాత్రమే కాకుండా ఆలోచన శక్తిని, తార్కికతను, సమస్యల పరిష్కారాన్ని చూపుతోందని సూచించారు. అందుకనే విద్యార్థులు గణితాన్ని భయపడకుండా ఆసక్తిగా నేర్చుకుంటే వారి భవిష్యత్తు బంగారు మయమవుతుందని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆంగ్ల మీడియంలోప్రథమబహుమతి.. డి హారిని జడ్.పి.హెచ్.ఎస్ కల్వల , ద్వితీయ బహుమతిని మనోహర్ జడ్పిహెచ్ఎస్ తాళ్ల పూస పల్లి,మరియు తృతీయ బహుమతి కే అక్షయ జెడ్పిహెచ్ఎస్ పెనుగొండ గెలుచుకొని జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ ఎంపిక కావడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్, టాలెంట్ టెస్ట్ జిల్లా పరిశీలకులు పాండురంగ, దుర్గాప్రసాద్, టీఎంఎఫ్ ప్రధాన కార్యదర్శి రాచకొండ ఏకాంబరం, కోశాధికారి ఆకుల మధు, గణిత ఉపాధ్యాయులు ధనుసరిఎలేంద్ర,జె.వీరస్వామి, ఈ శ్రీనివాస్, ఆర్ యాదగిరి, ఎం బీముడు, మరియు పాఠశాల ఉపాధ్యాయులు బి.సత్యనారాయణ, వి. నాగేందర్, ఆర్ బిక్షపతి, వి రాజేంద్ర చారి, వి రాము, కే రాములు, ఎండి జుబేర్ అలీ, ఎస్ రాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి సహకరించండి..

**శనిగాపురం రోడ్డు నుండి కేసముద్రం రోడ్డు లింకు రోడ్డు నిర్మాణం కు రూ.50 లక్షలు..**
**ఎమ్మెల్యే మురళీ నాయక్**



మహబూబాబాద్,ప్రతినిధి,డిసెంబర్.20,తరంగాలు:శని వారం మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని శనిగాపురం రోడ్డు మీదుగా ఫాతిమా స్కూల్ నుండి కేసముద్రం రోడ్డుకు కలిపేందుకు లింకు రోడ్డు నిర్మాణంకు ఎమ్మెల్యే డా మురళి నాయక్ రూ.50 లక్షలు కేటాయించారు. నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు మున్సిపాలిటీ డెవలప్మెంట్ ఫండ్ నుండి నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం కై స్థల పరిశీలిన చేశారు.దీనికి సహకరించిన ఫాతిమా స్కూల్ యాజమాన్యం ను ప్రశంసించారు. గత 10 ఏండ్ల పాలనలో మున్సిపాలిటీ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం – ప్రజా ప్రభుత్వం అని, ప్రజల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, మున్సిపాలిటీ డిఇ,ఫాతిమా స్కూల్ యాజమాన్యం, జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గా నాగండ్ల దీపక్ చౌదరి పదవీ స్వీకారోత్సవం

**దీపక్ చౌదరిని ఘనంగా సన్మానించిన మంత్రి తుమ్మల**

ఖమ్మం జిల్లా బ్యూరో డిసెంబర్ 20 తరంగాలు : ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడుగా నాగబండ్ల దీపక్ చౌదరి ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.... దీపక్ చౌదరి ఎంతో కాలం నుండి పార్టీలో కష్టపడుతున్నాడని ఆ కష్టానికి ఫలితం ఈరోజు దక్కిందన్నారు. తనకు ఇచ్చిన పదవిని నిలబెట్టుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు తొలగించడం బీజేపీ దేశ ద్రోహమే అన్నారు. తుపాకీ తూటాలకు బలై హే రామ్ అంటూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు మహాత్మా గాంధీ అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్క గ్రామ పంచాయతీ లో బీజేపీ నీ గెలిపించకుండా తీర్పు ఇచ్చిన జిల్లా ప్రజలకు మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీలో ఉండి పదవిలో ఉంటూ కాంగ్రెస్ కు నష్టం చేసే నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొందరు నేతల వల్ల కొన్ని గ్రామాల్లో మాత్రమే ఓటమి పాలయ్యారు. పార్టీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కట్టారు. సీఎం రేవంత్ రెడ్డి



ప్రజా పాలనకు మద్దతుగా పంచాయితీ ఫలితాలు ఖమ్మం జిల్లాలో ఆశించిన దాని కంటే ఎక్కువ వచ్చాయి. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. అరాచకం అవినీతి వేధింపు రాజకీయాలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఖమ్మం జిల్లాలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీనీ ఏమి ఆశించారో అది నిజమయ్యేలా ప్రజా పాలన చేస్తున్నామన్నారు.

## చిర్ర యాకాంతం గౌడ్ దంపతులను సన్మానించిన పిడిఎస్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు,,

కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, డిసెంబర్.20, తరంగాలు :కేసముద్రం మండల ప్రాంతంలో 19 సంవత్సరాలుగా విద్య బోధన చేస్తూ విద్యార్థులను అనేకులను ఉన్నత స్థితిలోకి తీర్చినటువంటి విద్యావేత్త శ్రీ వివేకానంద స్కూల్ యాజమాన్యం అధిపతి చిర్ర ఏకాంతం గౌడ్ నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామంలో జరిగిన సర్పంచి ఎలక్షన్లో గత పది సంవత్సరాలుగా ఆ గ్రామానికి చేస్తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు తనను సర్పంచ్ గా గెలిపించడం ఆ గ్రామ అభివృద్ధికి తోడ్పాటుగా అవుతుందని విద్యాదానంలో అనేక ఆటుపోట్లలో ఎదుర్కొంటూ జిల్లాలోనే ఒక ఉన్నత శ్రేణి విద్యను అందించే పాఠశాలగా గుర్తింపు తెచ్చుకోవడం



ఒక గ్రామానికి సర్పంచ్ గా ఎన్నిక కావడం ఆనందదాయకమని,దీని వెనుక కష్టాలలో నష్టాల్లో ఇబ్బందుల్లో తోడున్న తనకు స్నేహితునిగా వెన్నంటున్న యాకాంతం గౌడ్ సతీమణి విజయ ఎంతో కృషి ఉందని పిడిఎస్ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష కార్యదబనిశెట్టిర్శి,విజయ వెంకటేష్ తెలిపారు, రాబోయే రోజుల్లో విద్యార్థులను ఇంకా ఉన్నతశ్రేణిలోకి తీర్చిదిద్ది వారి భవిష్యత్తుకు పూలబాట వేయాలని,అలాగే గ్రామ అభివృద్ధికి తోడ్పాటు కృషి చేయాలని అందుకు ఆ దేవుని దీవెనలు ప్రజల ఆశీర్వాదాలు మీకు ఎప్పుడు ఉంటాయని ఈ సందర్భంగా బనిశెట్టి విజయ వెంకటేష్ లు తెలిపినారు. ఈ సందర్భంగా వారు వారిని ఘనంగా సన్మానించి స్వీట్లు పంచిపెట్టారు.

# మన గ్రోమోర్ యూరియా యాప్ ని ప్రారంభించిన కలెక్టర్

నల్గొండ అర్సీ, డిసెంబర్ 20, తరంగాలు: రైతులకు అవసరమైన యూరియా ,ఎరువులు సమయానికి, పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో ఫర్టిలైజర్స్ యూరియా ఆన్లైన్ బుకింగ్ యాప్ను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.

శనివారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలో "మన గ్రోమోర్ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ" లో ఫర్టిలైజర్ యూరియా బుకింగ్ యాప్ ప్రారంభించారు.ఈ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన యూరియాను ముందుగానే బుక్ చేసుకుని, నేరుగా సమీప డీలర్ వద్ద పొందే సౌకర్యం కల్పించబడిందని కలెక్టర్ తెలిపారు.ఇకపై ఎరువుల కోసం రైతులు క్యూలో నిలబడాల్సిన అవసరం ఉండదని, ఎరువుల అక్రమ నిల్వలు, దళారుల బెడద తగ్గుతుందని చెప్పారు. యాప్లో నమోదు చేసిన వివరాల ఆధారంగా యూరియా సరఫరా ,పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని, ప్రతి రైతుకు న్యాయంగా ఎరువులు అందుతాయని స్పష్టం చేశారు.రైతులు తమ మొబైల్ ఫోన్లో యాప్ను డౌన్లోడ్ చేసుకుని ఆధార్, భూమి






వివరాలతో ఎరువులకై నమోదు చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయ అధికారులు, డీలర్లు రైతులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. డిజిటల్ వ్యవస్థల ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు జిల్లా ,మండల స్థాయి లో ఎంత యూరియా డీలర్ల దగ్గర ఉన్నదో ఈ యాప్ ద్వారా తెలుస్తుందన్నారు.ఇది శాస్త్రీయమైన యాప్ అని, ఒక రైతుకు ఉన్న 5 ఎకరాల వ్యవసాయంలో ఎంతవరకు యూరియా అవసరామో ఈ యాప్ ద్వారా ఇస్తారన్నారు. ఈ యాప్ నిపుణులు తయారు చేశారని, చిన్న చిన్న మార్పు చేర్పులు అవసరమైనా, లేదా రైతులకు ఏమైనా సమస్యలుంటే ఏవో లేదా జెడిఎ దృష్టికి తీసుకురావాలనికోరారు. ఈ ఆప్ వల్ల బోగస్ కంపెనీలు లేకుండా, బ్లాక్ మార్కెట్ జరగకుండా పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఈ ఆప్ పట్ల రైతులు ఎలాంటి అపోహలు నమ్మవద్దని, వ్యవసాయ శాఖ మంచి అడుగు వేసిందని,అవసరమైతే రెవిన్యూ సిబ్బంది ని ఉపయోగించుకుంటామని తెలిపారు.ఈ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ని రైతులు ఉపయోగించుకొని రాష్ట్రలో నల్లగొండ నెంబర్ వన్ స్థానాన్ని పొందే విధంగా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జెడి శ్రవణ్ కుమార్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరు శ్రీనివాస్,పి ఏ సి ఎస్ డైరెక్టర్ సంపత్ రెడ్డి,ఫెర్టిలైజర్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకలు ఏర్పాట్ల పై సమీక్ష



వరంగల్ ప్రతినిధి, 20 డిసెంబర్, తరంగాలు: క్రిస్మస్ పండగను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లో క్రిస్మస్ సంబరాల ఏర్పాట్లపై అధికారులు, పాస్టర్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజక వర్గానికి 2 లక్షలు ఖర్చు తో మూడు నియోజక వర్గాల వారిగా వరంగల్ నర్సంపేట ,వర్ధన్నపేట తహసీల్దార్లకు ఏర్పాట్లు పురమాయించారుఈ పండుగ ఏర్పాట్లను అధికార యంత్రాంగం డబ్ల్యూఎంసి కమిషనర్, డిపిఓ, ఎలక్ట్రిసిటీ, పోలీస్ తదితర శాఖల అధికారులకు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుటకు తగు ఏర్పాటు చేయాలని, గత క్రిస్మస్ పండగ లో ఏదేని అవాంతరాలను పునరావృతం కాకుండా చూడాలని జిల్లా మైనారిటీ అధికారిని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పండగ వాతావరణం శాంతియుతంగా, ఆనందంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమా ఉమారాణిలు,మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, సంబంధిత మండలాల తాసిల్దార్లు, దీన్ దయాల్ పాస్టర్, వినయ్ పాస్టర్, దావీద్ కొండ, ప్రభాకర్, ఎమ్మెస్ రాజు మాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సెర్ప్- ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

## ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా సారయ్య వెంకట్

వరంగల్ ప్రతినిధి,డిసెంబర్ 20, తరంగాలు: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ- గ్రామీణ అభివృద్ధి సంస్థ (సెర్ప్-డిఆర్డిఏ) లో పనిచేస్తున్న వరంగల్ జిల్లా ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు శుక్రవారం డిఆర్డిఏ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసుకొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా కాందారి సారయ్య, కోశాధికారిగా గుగులోతు వెంకన్న, ఉపాధ్యక్షులుగా గోలి కొమురయ్య (పర్వతగిరి),గుండేటి కుమారస్వామి (సంగెం), శారద (దుగ్గొండి), కోశాధికారిగా వనమ్మ (నర్సంపేట), సహాయ కార్యదర్శులుగా రాజయ్య, సంపత్, యాకూబ్, కార్యవర్గ







సభ్యులుగా మంజుల,బాబు, సుధాకర్, మోహన్ బాబు, సురేష్,గౌరవ అధ్యక్షులుగా మెట్టు దాసు (డీపీఎం యు వరంగల్) సలహాదారులుగా అనిల్ (హెడ్ కోటర్) రమేష్ లీగల్( దుగ్గొండి) అడ్వైజర్ గా కందిక సుధాకర్ (నల్లబెల్లి) లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు సారయ్య ఉపాధ్యక్షుడు గోలి కొమురయ్య లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఎస్టీ ఎస్టీ ఉద్యోగులందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం కృషి చేస్తామన్నారు. మా మీద నమ్మకంతో మాకు జిల్లా బాధ్యతలను అప్పగించిన ప్రతి ఒక్క ఉద్యోగికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు

## వయోవృద్ధుల సంక్షేమం కొరకు న్యాయ సేవలు



వరంగల్ ప్రతినిధి, 20 డిసెంబర్, తరంగాలు: వరంగల్ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో గల ఆర్డీఓ కార్యాలయంలో శనివారం వ ృద్ధుల సంక్షేమం కొరకు ఏర్పాటుచేసిన న్యాయ సేవల శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ, వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారదతో కలసి ప్రారంభించారు. ఈ సందరరేగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ "తల్లిదండ్రులు మరియు వ ృద్ధుల సంరక్షణ - మన సామాజిక మరియు చట్టపరమైన బాధ్యత అనితెలిపారు.?ఈ ఉచిత న్యాయ సేవా శిబిరం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, ఇది మన ఇంట్లో ఉన్న వ ృద్ధులకు మనం ఇచ్చే భరోసా. వ ృద్ధులలో ఆత్మగౌరవం తగ్గకూడదని, నేటి సమాజంలో మారుతున్న జీవనశైలి వల్ల చాలామంది వ ృద్ధులు ఒంటరితనాన్ని, నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నారు. దీనిని ద ృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం 2007లో "తల్లిదండ్రులు మరియు వ ృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం" తీసుకువచ్చిందని తెలిపారు.వ ృద్ధులు ?పోషణ పొందే హక్కు, ?ఆస్తి రక్షణ, ?తక్షణ పరిష్కారం మొదలగు హక్కులు కలిగి ఉన్నారని వివరించారు.

# నూతన సర్పంచ్లకు, ఉప సర్పంచ్లకు ఘన సన్మానం...

### నూతన సర్పంచ్లు గ్రామానికి మంచి సేవ చేసి ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్, ప్రతినిధి, డిసెంబర్. 20,తరంగాలు: శనివారం గూడూరు మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హల్ లో గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నూతన సర్పంచ్ ల ,ఉపసర్పంచుల అభినందన సమ్మేళన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహబూబాబాద్ శాసనసభ్యులు





డా భూక్యా మురళీ నాయక్,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నారు.రానున్న ఎం పీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ఉండి నియోజకవర్గంలో అన్నిస్థానాల్లో విజయం సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మండల నాయకులు, పట్టణ నాయకులు, యూత్ నాయకులు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు వార్డ్ మెంబర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అనుచరుడి పాడె మోసిన మంత్రి పొంగులేటి..

పాలేరు ఆర్సీ,20 డిసెంబర్ ( తరంగాలు) : పాలేరు గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు యడవల్లి రామిరెడ్డి అంతిమయాత్ర శనివారం అశ్రునయనాల నడుమ ముగిసింది. రామిరెడ్డి కుమారుడు విదేశాలలో ఉన్న కారణంగా దేహాన్ని మమత హాస్పిటల్ ఫ్రీజర్ నందు భద్రపరిచి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు హాజరై రామిరెడ్డి పాడె మోసి అనుచరునికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి భావోద్వేగానికి లోనైనారు. మంచి లక్ష్యంతో పార్టీని నడిపించే నాయకున్ని కోల్పోవడం బాధగా ఉందని అన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియపరిచి,



ధైర్యంగా ఉండాలని కోరారు. ఎంత చేసినా రామిరెడ్డి లాంటి నిబద్ధత కలిగిన నాయకున్ని మనం తీసుకురాలేమని అన్నారు. కుటుంబ సభ్యులకు పార్టీ అండదండలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ అనితా రెడ్డికి పి.ఎమ్ మోడి విజన్ ఆఫ్ భారత్ 2025 అవార్డు



హన్మకొండ ప్రతినిధి, డిసెంబర్ 20,తరంగాలు : అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు మరియు వరల్డ్ వైజ్ కన్జుమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి కి ఇంటర్నేషనల్ మనం పౌండేషన్ వారి నుండి పి.ఎమ్ మోడి విజన్ ఆఫ్ భారత్ -2025 సర్టిఫికేట్, అవార్డు లభించింది, అత్యధిక సామాజిక కార్యక్రమాలు, ప్రపంచ శాంతి కోసం మరియు దేశభక్తి పెంపొందించే ఎన్నో రకాలగా కార్యక్రమాలు చేయడం, ముఖ్యంగా ప్రభుత్వం ఏర్పరిచే పథకాలు,చట్టాలు అమలు పరచడం కోసం ప్రజలకి అవగాహన కార్యక్రమాలు చేపట్టడంలో చాలా కీలక పాత్ర వహిస్తున్న డాక్టర్ అనితా రెడ్డి సేవలు అలాగే ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ఉంటే కలిగే లాభాల పట్ల అవగాహన సదస్సులు నిర్వహించడం, గత 30 సంవత్సరాలుగా అనాధ పిల్లలకు, మానసిక శారీరక దివ్యాంగులకు అమ్మ ప్రేమ ని అందిస్తు వారి ని స్వంత కర్చులతో చదివిస్తూ కావలసిన బాగోగులు చూస్తూ , దివ్యాంగులను, అనాథ పిల్లలను వ ృద్ధులను, మహిళలను ఆదరిస్తుండడం, వారి అభివ ృద్ధి కి సహకరించి,చేయుత నిస్తుండడం తో వారి అత్యుత్తమ సేవలను గుర్తించి ఈ అవార్డు సర్టిఫికేట్ కు ఎంపిక చేసామని మనం పౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి తెలియజేసారు. డాక్టర్ అనితా రెడ్డి సేవలు ఎందరికో స్పూర్తి గా నిలుస్తున్నా యన్నారు. ఈ సందరరేగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు సర్టిఫికేట్ లభించినందుకు సంతోషంగా ఉందని, పి. ఎమ్ మోడీ పేరిట అవార్డు ను ఊహించలేదని చాలా ఆనందంగా ఉందని అలాగే మరింత బాధ్యత పెంచిందని, ఇక ముందు కూడా సమాజహితం కోరే సేవా కార్యక్రమాలు అవసరార్ధులకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని అన్నారు.మా సేవా కార్యక్రమాలలో ఆర్భాటాలకు, అట్టహాసాలకు స్థానం ఉండదని స్వఛమైన సేవలే అవసరార్ధులకు అందిస్తామని అందుకే ఇంత గుర్తింపు లభించిందని ఇకముందు కూడా దీనిని నిలబెట్టుకునే సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు.

# ఐనవోలు జాతరలో భక్తుల సౌకర్యార్థం పటిష్ట ఏర్పాట్లు

**జాతరను ప్రశాంతంగా, విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు**
**రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



హనుమకొండ ప్రతినిధి: 20 డిసెంబర్, తరంగాలు: ఐనవోలు శ్రీ మల్లికార్జునస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు,శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కానారేన్స్ హాలు లో ఈ నెల 13వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఐనవోలు జాతర ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ఆలయ కమిటీ ప్రతినిధులతో కలసి సంబంధిత శాఖల అధికారులతోసమీక్ష నిర్వహించారుఈ సమావేశంలో దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బీ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, కుడా, మున్సిపల్, మిషన్ భగీరథ, ఇతర అధికారులతో ఆయా శాఖల ఆధ్వర్యంవైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, భద్రత వంటి జాతరలో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు లు సమీక్షించారు.ఈ సందరరేగా రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఐనవోలు జాతర నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించాలన్నారు. బస్టాండ్ ఏర్పాటు చేసే చోట భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ కూడా భక్తుల కోసం తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. జాతరలో పారిశుధ్య నిర్వహణ ఎంతో ముఖ్యమని పంచాయతీ అధికారులు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అవసరమైతే పక్కన ఉన్న గ్రామ పంచాయతీలకు సంబంధించిన సిబ్బందిని పారిశుధ్య నిర్వహణకు కేటాయించాలని సూచించారు. జాతరలో ఇరవై నాలుగు గంటలు విద్యుత్ అంతరాయం లేకుండా ఏ చిన్న సమస్య లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. జాతరకు చిన్నపిల్లల కొరకు అంగన్వాడీ కేంద్రాలలో అందించే బాలామృతం పౌష్టికాహారాన్ని ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల ఆరోగ్య సంరక్షణ కు జాతర ప్రాంగణంలో వైద్య సదుపాయాలు కల్పించాలని అన్నారు. జాతర లో 108 వాహనాలు అందుబాటులో ఉంచాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలు అవగాహన కల్పించేలా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. జాతరలో మహిళా సంఘాలకు స్టాల్స్ ఏర్పాటు చేయించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, అందులో మహిళలకు ప్రత్యేకంగా టాయిలెట్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు కూడా స్వచ్ఛందంగా వైద్య సేవలు అందించే విధంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు తగినన్ని ఏర్పాటు చేయాలన్నారు. అదనంగా బస్సుల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఐనవోలు జాతర నుండి భక్తులు కొమురవెల్లి, మేడారం కు వెళ్లే అవకాశాలు ఉంటుందని, అందుకు తగినవిధంగా బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా సరైన పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు తగిన ముందస్తు జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. జాతరలో అనుమానితులు, దొంగతనాలు జరగకుండా పోలీసుల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అధిక సంఖ్యలో భక్తులు జాతరకు వస్తారని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. జాతర ఏర్పాట్లలో సంబంధిత

శాఖల పనితీరును బట్టి ప్రోత్సహకాలతో ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మహిళలు జాతరలో పాల్గొంటారని, వారి భద్రత నిమిత్తం మహిళా పోలీసు సిబ్బందిని పోలీస్ శాఖ కేటాయించాలన్నారు. జాతర సమీపిస్తున్న దృష్ట్యా రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఇబ్బంది లేకుండా సైడ్ బర్మ్ లతో నింపాలన్నారు. ఆర్ అండ్ బీ, పోలీస్ శాఖలు సమన్వయంతో జాతరలో బ్యారీకేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శాశ్వత టాయిలెట్స్ నిర్మాణ పనులను పూర్తిచేయాలని అన్నారు. జాతర ప్రాంగణంలో అక్రమ మద్యం అమ్మకాలు జరగకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జాతర విశిష్టతను తెలియజేస్తూ ఎల్ఈడి స్క్రీన్ లను ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించాలన్నారు. 24 గంటల పాటు విధుల్లో ఉండే పారిశుద్ధ్య నిర్వహణ సిబ్బందికి వారి ఆరోగ్య దృష్ట్యా మాస్కులు, భోజనం, తాగునీరు, తదితర సౌకర్యాలతో పాటు అవసరమైన వారికి వైద్య సదుపాయం కల్పించాలని అన్నారు. నిత్యాన్నదాన కార్యక్రమంలో భక్తులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాతర విధులను నిర్వర్తించేందుకు ఒక వాట్సాప్ గ్రూప్ ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జాతర విధుల్లో ఉన్న వారిని మానిటరింగ్ చేసే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జాతరలో ఏ చిన్న సంఘటన జరగకుండా చూసుకోవాలని అన్నారు. ఐనవోలు జాతరను ప్రశాంతంగా నిర్వహించే విధంగా వివిధ శాఖలు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. జాతర ఏర్పాట్లు బాగుండాలని అన్నారు.సమ్మక్క జాతర ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందబోతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో అక్కడ అభివృద్ధి పనుల ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జోగులాంబ, కొండగట్టు, కీసర, ఇతర చారిత్రక దేవాలయాలను ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు తగిన ప్రతిపాదనలు తయారు చేస్తుందన్నారు. ఐనవోలు జాతర ఏర్పాట్లను చాలెంజ్ గా తీసుకొని అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు మాట్లాడుతూ ఐనవోలు జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. విఐపి దర్శనం కోసం సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విఐపి దర్శనం కోసం రుసుమ చెల్లించిన వారికి టోకెన్లు ఇవ్వాలని సూచించారు. జాతర లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మహిళా పోలీస్ సిబ్బందిని ఎక్కువ గా కేటాయించాలని పేర్కొన్నారు. జాతరకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా రోడ్ల పక్కన వ్యవసాయ బావులు ఉన్నందున ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఆర్ అండ్ బి, పోలీసు అధికారులు సమన్వయంతో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రతి శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతర బందోబస్త్ లో పోలీస్ శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారుఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జాతరలో మెరుగైన సౌకర్యాలను వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వివిధ శాఖలు ఏర్పాట్లు పూర్తిచేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. గత జాతర ఏర్పాట్లను గురించి సమీక్ష చేసి ఈ జాతర నిర్వహణలో పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఈ సందరరేగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ జాతర లో పది వాటర్ ట్యాంకర్లను జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామని, డంపర్ బిన్లను ఏర్పాటు చేసి పారిశుధ్య నిర్వహణ చేపడుతామన్నారుసమీకక్షా సమావేశం అనంతరం జాతర ఉత్సవాల పోస్టర్లను మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, కలెక్టర్ స్నేహ శబరీష్, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు ఆవిష్కరించారు.అదేవిధంగా పర్యాటక శాఖకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి సురేఖ, ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు లను శాలువాలతో సత్కరించారు.

రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు కలెక్టరేట్ వద్ద పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.ఈ సమావేశంలో డీసీపీ అంకిత్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కార్యనిర్వాహణాధికారి సుధాకర్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు







# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు





**వరంగల్ ప్రతినిధి,20 డిసెంబర్ తరంగాలు:** రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు .శనివారం హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిఎస్ రామ కృష?రావు ,స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి లతో కలసి రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కానారేన్స్ నిర్వహించారు.జనవరి లో జరిగే రోడ్ సేఫ్టీ మాసంలో చేయాల్సిన కార్యక్రమాలు పై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించడానికి రోడ్ సేఫ్టీ మాసంలో విద్యార్థులను , ఉద్యోగులను, వివిధ సంస్థలను భాగస్వామ్యం చేసేలా వారికి అవగాహన సదస్సు లు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఏర్పాటు చేసుకోవాలని, పక్కాగా ట్రాఫిక్ రూల్స్ పాటించే విధంగా ప్రతి ఒక్కరి బాధ్యత తెలియపరిచే విధంగా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు.వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నేషనల్ హైవే మీద ఎక్కువగా ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్నచోట్ల ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశామని, ప్రధాన రహదారులకు ఇరువైపుల వీధి వ్యాపారులను తొలగించామని, రోడ్లపై రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ వీడియో కానారేన్స్ లో ఆర్డీవో సుమ ,ఆర్ అండ్ బి ఇ ఇ రాజేందర్, జిల్లా ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ శోభన్ బాబు, బిసి వెలేరే ఆఫీసర్ పుష్పలత, డీఈవో రంగయ్య నాయుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## సమాజ సేవకుడు పరుపాటి
# శ్రీనివాస్ రెడ్డికి పద్మ మోహన అవార్డు

**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్**
**చేతుల మీదుగా అందుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 20,తరంగాలు:పద్మ మోహన అవార్డును ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్,బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అందుకున్నారు.శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో బుల్లితెర పెద్ద పండుగ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తో పాటు సామాజిక సేవకుడు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ చేతుల మీదుగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరిపాటి శ్రీనివాస్ రెడ్డి పద్మ మోహన అవార్డు అందుకున్నారు.

# ఓడినా బలనిరూపణ.. గెలిచినా ప్రతికూలత !

హైదరాబాద్, : పంచాయతీ ఎన్నికలు ఎట్టకేలకు ముగిశాయి. గత పది రోజులు రాష్ట్రమంతా హడావిడి వాతావరణం నెలకొన్నది. ఆయా పార్టీలు తమ మద్దతు దారుల తరఫున విస్తృతంగా ప్రచారం చేసి గెలిపించుకున్నాయి. అయితే, పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సింహభాగాన్ని కైవసం చేసుకున్నది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తన ఉనికి చాటుకోవడంతోపాటు రాజకీయ వర్గాలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఏ రాష్ట్రంలోనైనా జరిగే ఉప, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూల ఫలితాలు రావడం సహజమేతెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీకే అత్యధిక స్థానాలు వచ్చినప్పటికీ.. అధికార పార్టీ అంచనా వేసుకున్న స్థాయిలో మాత్రం సర్పంచ్ స్థానాలు గెలుచుకోలేకపోయింది. పంచాయతీ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ పార్టీకి గ్రామీణ స్థాయిలో ఉన్న బలాన్ని మరోసారి స్పష్టంగా నిరూపించాయి.

అదే తరుణంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు సాధిం చినప్పటికీ, క్షేత్రస్థాయిలో కొన్ని ప్రతికూల పరిస్థితులు కూడా బయటపడ్డాయి. చెక్కు చెదరని బీఆర్ఎస్ కేడర్. 12వే ల గ్రామాల్లో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ సు మారు 50 శాతం స్థానాలు గెలుచుకోగా, బీఆర్ఎస్ పార్టీ దాదాపు 30 శాతం పంచాయతీలను కైవసం చేసుకుంది. వాస్తవానికి అధికారంలో ఉ న్న పార్టీకి కొంత మేర సానుకూలమైన వాతావర ణం ఉండటం సహజమే. కానీ ఆశించిన మేర కాం గ్రెస్ పార్టీ సర్పంచులను గెలుచుకోలేకపోయింది. 2023 అసెంబ్లీ, 2024 పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే బీఆర్ఎస్ ఎంతో పుంజుకున్నట్టు తాజా పంచాయతీ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అధికార కాంగ్రెస్ ప్రభావం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ కేడర్ చెక్కు చెదరలేదు.







Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at ,HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**